క్లుప్తంగా

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన గొల్లపల్లి



గోపాలకృష్ణ ద్వివేదికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయ్‌కుమార్

ఇందుకూరుపేట : రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేదిని ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

మంత్రి కాకాణి పరామర్శ



మర్రిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్రిపల్లి గ్రామానికి చెందిన అనుదీప్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. నెల్లూరు నగరంలో అనుదీప్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామంలోని బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించి అండగా ఉంటానని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ కోసూరు అంకమ్మ, నాయకులు ఉన్నారు.

• మొగళ్లూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నేత గజ్జల కొండారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కొండారెడ్డి మృతి పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు. మృతుని చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ నేతలు యనమల రమణారెడ్డి, చెన్నూరు సుబ్బారెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. కంట్రోల్ రూమ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మణిపాల్ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి బైక్‌పై బయటకొస్తుండగా, ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో ఆయన స్వల్పంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆయన్ను జీజీహెచ్‌కు తరలించారు.

బైక్ ఢీకొని నర్సుకు..

గుర్తుతెలియని బైక్ ఢీకొనడంతో నర్సు గాయపడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్‌లోని అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తోటపల్లిగూడూరు మండలం చింతోపునకు చెందిన శ్రీలేఖ నగరంలోని మెటర్నిటీ హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తున్నారు. హాస్పిటల్‌కు వెళ్లేందుకు గానూ ఆత్మకూరు బస్టాండ్‌కు బస్సులో వచ్చారు. ఆటో ఎక్కేందుకు బోసుబొమ్మ వైపు వెళ్తుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని బైక్ ఆమెను వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని వాహనచోదకుడికి..

మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్ ఫ్లయిఓవర్‌పై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. సుబేదారుపేటకు చెందిన శివరామ్ హరిరామ్ పూటుగా మద్యం సేవించారు. అనంతరం తన స్కూటీపై రైల్వేస్టేషన్ వైపు నుంచి ఆత్మకూరు బస్టాండ్ ఫ్లయిఓవర్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీని ఢీకొన్నారు. ఘటనలో ఆయన స్వల్పంగా గాయపడగా, స్కూటీ ముందుభాగం దెబ్బతినింది. నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పొలం గట్టుపై నడుస్తుండగా పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు బుధవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ర్యాకలదేవిపల్లికి చెందిన నర్సయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు త్రిమూర్తి (26)కి ఉమాదేవితో మూడేళ్ల క్రితం వివాహమైంది. అదే గ్రామానికి చెందిన హేమేంద్రరెడ్డికి సంబంధించిన వరికోత యంత్రానికి ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అంబాపురంలో ఆదిశేషయ్యకు చెందిన పొలంలో వరికోత కోసం యంత్రంతో సహా ఈ నెల ఐదున వచ్చారు. పొలంలో గట్టుపై మంగళవారం నడుస్తుండగా, త్రిమూర్తి ఎడమకాలిపై పాము కాటేసింది. దీంతో ఆయన పెద్దగా కేకలేసి అక్కడే కుప్పకూలిపోయారు. విషయాన్ని గమనించిన కూలీలు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆయన్ను తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. త్రిమూర్తి సోదరుడు కిరణ్‌కుమార్ నెల్లూరుకు బుధవారం తెల్లవారుజామున వచ్చారు. వైద్యుల సూచన మేరకు తన సోదరుడ్ని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే త్రిమూర్తి మృతి చెందారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నిరంగాల్లో మహిళలదే పైచేయి

• ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పొదలకూరు సీహెచ్‌సీలో కేక్ కటింగ్ చేస్తున్న వైద్యులు

పొదలకూరు : ప్రస్తుత కాలంలో అన్నిరంగాల్లో మహిళలే పైచేయి సాధిస్తున్నారని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం రోజ్‌మేరీ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏపీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులను సమానంగా చూడాలన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీసీలు, పొదుపు సంఘాల మహిళలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో

పొదలకూరు పట్టణంలోని ఏపీటీఎఫ్(1938) భవన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై దాడులు, వేధింపు అనే అంశంపై చర్చ నిర్వహించారు. సమాజంలో పురుషుల వేధింపులను ఎలా ఎదుర్కోవాలో ఉపాధ్యాయినులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మోహన్‌దాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాల్యాద్రి, డి.సుబ్బయ్య, సుమితి, విజయ, మల్లీశ్వరి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

• పొదలకూరు సీహెచ్‌సీలో డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

మనుబోలు : స్థానిక అంబేడ్కర్ నగర్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వలంటీర్ మోచర్ల మల్లికార్జున పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కాంద్ర నాగమణి, బత్తల అపర్ణ, కోడి శాంతమ్మ తొలి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుచుకున్నారు.

• **బుచ్చిరెడ్డిపాళెం** : మండలంలోని పలుచోట్ల బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని పాఠశాలల్లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

• బుచ్చిరెడ్డిపాళెంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిగింది. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఏపీఎం లలితా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఉన్నతంగా రాణించాలి

కొడవలూరు : మహిళలు అన్నిరంగాల్లో ఉన్నతంగా రాణించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ప్రాంగణంలో మహిళలకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మహిళలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నతంగా రాణిస్తున్నారని, వారి స్ఫూర్తితో మహిళలంతా ముందుకు సాగాలని కోరారు. సంఘమిత్ర అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, మహిళా రైతు సమాఖ్య అధ్యక్షురాలు సుజీవనమ్మ, సీసీలు ఉదయ్, సుకన్య, శ్రీదేవి, మమత, శోభ, వీఓఏలు పాల్గొన్నారు.

గండవరంలో..

మహిళా దినోత్సవం సందర్భంగా గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, సావిత్రి భాయ్‌పూలే తదితర వీర నారీమణులకు హిందీ పండిట్ జి.నాగభూషణం ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పదో తరగతి బాలికలకు పరుగు పందెం పోటీలు నిర్వహించి తొలి మూడు స్థానాల్లో నిలిచిన రేణుక, శ్రీలేఖ, కావ్యలకు బహుమతులు అందజేశారు.

కృష్ణపట్నం పోర్టులో..

ముత్తుకూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా అదానీ కృష్ణపట్నం పోర్టులో సీఓఓ సంజయ్ కొత్త ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, కార్మికులకు క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

ముత్తుకూరులో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సభ్యులకు తినిపించారు. హోలీ పండగ పురస్కరించుకుని రంగులు చల్లుకుని సందడి చేశారు.

గీతాంజలిలో..

కోవూరు : గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల ఐసీసీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐఆర్‌సీఎస్ కేన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి హాజరై, మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్, ఐసీసీ కన్వీనర్ డాక్టర్ కె.విజయ, మహిళా సిబ్బంది ఉన్నారు.



పొదలకూరు : ఏపీటీఎఫ్ భవన్‌లో..



మనుబోలు : విజేతలకు బహుమతుల అందజేత



పొదలకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం



ముత్తుకూరు : కేక్ తినిపిస్తున్న వాసవి వనితా క్లబ్ సభ్యులు



బుచ్చిరెడ్డిపాళెం : బహుమతుల అందజేత



కొడవలూరు : గండవరం జెడ్పీ పాఠశాలలో..



కొడవలూరు : ఐకేపీ కార్యాలయంలో..



బుచ్చిరెడ్డిపాళెం: ఐకేపీ కార్యాలయంలో..

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణి సమేత పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి పండరి భజనలు అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

వసంతోత్సవం, ఏకాంతసేవ

బ్రహ్మోత్సవాల చివరిరోజైన బుధవారం వసంతోత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ధ్వజారోహణం, హోమం, నైవేద్యం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. చివరగా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు.

మావులూరుకు అభినందన



ఇందుకూరుపేట : నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన మావులూరు శ్రీనివాసులురెడ్డికి మండలంలోని పలువురు నేతలు అభినందనలు తెలిపారు. ఇందుకూరుపేటలోని ఆయన నివాసంలో నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, మొక్కలు అందజేశారు. కలిసిన వారిలో గూడూరు ప్రభాకర్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, కావలి రవి, మెట్టా వెంకట్రామిరెడ్డి, తంబు వెంకటేశ్వర్లు, మారుబోయిన సంతోష్‌గౌడ్, సర్పంచ్ నాయుడు సురేష్ ఉన్నారు.

ఆశ్రమ సేవలు అభినందనీయం



ఆశ్రమంలోని చిన్నారులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : అనాథాశ్రమంలో బాలబాలికలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. నార్తురాజుపాళెం మజరా టపాతోపులోని విశ్వజనని అనాథాశ్రమంలో ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన భోజనశాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలోని బాలలకు సకల వసతులు కల్పించడంతో పాటు మంచి పౌష్టికాహారం, విద్య, వినోదం అందిస్తూ సొంత బిడ్డల్లా చూసుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ బి.సుప్రియ, డీఎల్‌డీఏ డైరెక్టర్ ఎం.మల్లికార్జున, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎండి.కరిముల్లా, ఇసనాక సునీల్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మంత్రి కాకాణి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

ముత్తుకూరు : గ్రామాల అభివృద్ధి–పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో మూడో రోజు బుధవారం సాయంత్రం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెడిచర్లమిట్టలో 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి కాకాణి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం వల్ల ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరిస్తున్నామన్నారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విశాఖపట్నంలో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో పారిశ్రామికవేత్తలు చేసుకున్న ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. వీటి వల్ల ఉద్యోగ–ఉపాధి అవకాశాలు కల్పించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సకాలంలో వర్షాలు కురవడం, పంటలు సమృద్ధిగా పండడం, ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించడం చూసి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ బోరున విలపిస్తున్నారన్నారు. పాలకులు మంచివారైతే ప్రకృతి సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కట్టా సుబ్రహ్మణ్యం, షేక్.మస్తాన్, షేక్ జమీల్, దామవరపు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు మెమెంటోలు

మండలంలోని డమ్మాయపాళెంలో జరిగిన క్రికెట్ టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి కాకాణి చేతుల మీదుగా మెమెంటోలు బహూకరించారు. నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించండి

• ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

వెంకటాచలం : తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య కోరారు. మండలంలోని కసుమూరు, ఎర్రగుంట గ్రామాల్లో బుధవారం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు శ్రీరామరక్షగా నిలుస్తాయని చెప్పారు.

• **మనుబోలు** : ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మనుబోలు కోదండరామపురంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేర్నాటిని గెలిపిస్తే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, దాసరి మహేంద్రవర్మ, కోసూరు కోటేశ్వరగౌడ్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• **ముత్తుకూరు** : పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాదరెడ్డి విజయం కోసం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం ప్రచారం సాగించారు. ఇందులో భాగంగా పంటపాళెంలో వైఎస్సార్‌సీపీ నేతలు మారు సుధాకర్‌రెడ్డి, నంగా చెంగారెడ్డి తదితరులు పట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థించారు. ముసునూరు వారిపాళెంలో సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ఇదే విధంగా ముత్తుకూరులో కూడా ఎంపీటీసీ సభ్యులు ప్రచారం సాగించారు.

• **బుచ్చిరెడ్డిపాళెం** : తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి మండలంలోని ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. కాగొల్లుపాడులో నాయకులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నేతలు వినోద్, వేణు మహేష్, ప్రేమేంద్ర, కృష్ణారెడ్డి, సురేష్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

• విడవలూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జరిగింది. వరిణి, దండిగుంట గ్రామాల్లో పేర్నాటిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు భక్తవత్సలయ్య, నేతలు బెల్లకొండ శ్రీధర్, కాగొల్లు మస్తానయ్య, లగుంతోటి వినయ్, రమణయ్య, విజయ్ పాల్గొన్నారు.

• **ఇందుకూరుపేట** : పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల రైతు విభాగం అధ్యక్షుడు గూడూరు శివకుమార్‌రెడ్డి మండల కేంద్రంలో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు బండ్ల జనార్ధన్, సురేంద్ర, మురళి, రామ్మోహన్ ఉన్నారు.



వెంకటాచలం : కసుమూరులో..



మనుబోలు : కోదండరామపురంలో..



విడవలూరు మండలంలోని వరిణిలో..



ఇందుకూరుపేట మండల కేంద్రంలో..



ముత్తుకూరు : పంటపాళెంలో..



ముత్తుకూరు : ఎంపీపాళెంలో..



బుచ్చిరెడ్డిపాళెం: కాగొల్లుపాడులో..

సోమిరెడ్డీ.. కుల రాజకీయాలు తగదు

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం : రాజకీయ మనుగడ కోసం సోమిరెడ్డి కుల రాజకీయాలు చేయడం తగదని, ఇకనైనా మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య హెచ్చరించారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పలువురు నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జంగాలపల్లి గ్రామంలో టీడీపీ నేత గుమ్మా రాజగోపాల్ అదే గ్రామానికి చెందిన పిల్లిపాకు పెంచలయ్యపై హత్యాయత్నానికి పాల్పడితే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, అయితే దీనిపై సోమిరెడ్డి కుల రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో యాదవులపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ప్రచారాలు చేయడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు యాదవులకు ప్రాధాన్యం ఇచ్చారా అని ప్రశ్నించారు. నియోజకవర్గ చరిత్రలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు.

లక్ష్మీనరసింహస్వామికి ఏకాంతసేవ

ఇందుకూరుపేట : ఇందుకూరుపేటలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామికి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం ఏకాంత సేవ నిర్వహించారు. అర్చకులు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రామాయణం శివకుమార్‌శర్మ జ్ఞాపకార్థం ఆయన సతీమణి వెంకటసుమన వ్యవహరించారు. అర్చకులు ఉదయగిరి రంగాచార్యులు, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థినులకు పౌష్టికాహారం



పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో బుధవారం నుంచి పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ చేతుల మీదుగా ఉపాధ్యాయినులు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ సురేఖ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.